వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 28 సెప్టెంబర్ 2023


## హోంశాఖ ముఖ్య కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసిన కాకర్ల



ప్రొద్దుటూరు సెప్టెంబర్ 27, ప్రభాతవార్త

అమరావతి రాష్ట్ర సచివాలయంలో బుధవారం రాష్ట్ర హెూం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ని రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగ శేషారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ముఖ్య కార్యదర్శి కలిసిన వారిలో రాజుపాలెం మండలం వైఎస్ఆర్సిపి కన్వీనర్ గుద్దేటి రాజారాం రెడ్డి ఉన్నారు.

## రైల్వేకోడూరులో చాపకింద నీరులా గంజాయి

### – చెడిపోతున్న యువత
### – చర్యలు తీసుకోవాలంటున్న పట్టణ వాసులు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రైల్వేకోడూరు పుల్లంపేట చిట్వేలి మండలాలలో మిగతా మండలాల్లో పలు ప్రాంతాల్లో గంజాయి వ్యాపారం జోరుగా సాగు తోంది. కోడూరు పట్టణంలో కొన్ని చోట్ల అడ్డాగా మారింది. దేశానికి దిశా, దశలను మార్చే నేటి యువత గంజాయి మహమ్మారికి బానిసై విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినకుండా విచ్చలవిడిగా యువకులు గ్రూపులుగా మారి బైకులపై రాద్ధాంతాలు చేస్తూ బూతుల పురాణాలు మాట్లాడుకుంటూ చెడిపోతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకొని గంజాయి ముఠాను అదుపులోకి తీసుకొని ఈ వ్యాపారంపై ఉక్కుపాదం మోపి క్రయ,విక్రయాలు జరగకుండా నిష్పక్షపాతంగా ఎటువంటి ప్రలోభాలకు నాయకులు ఒత్తులకు బంధు ప్రీతికి తావు లేకుండా గట్టి చర్యలు తీసుకొని యువత మంచి మార్గంలో నడిచేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

# వైకాపా సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో అలజడి

## రాజంపేట పార్లమెంట్ పరిధిలో లుకలుకలు



రాజంపేట అర్బన్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త

వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలన ప్రకటనలతో ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో అలజడి ప్రారంభమైంది. 3 నెలల క్రితం జరిగిన సమావేశంలో మెజారిటి సిట్టింగ్‌లకు టిక్కెట్లు ఇస్తామని వెల్లడించిన అధినేత తాజాగా మంగళవారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో చేసిన ప్రకటనకు ఎంతో తేడా కనిపిస్తోంది. గడప గడపకు జగనన్న కార్యక్రమం ప్రారంభానికి ముందు పనితీరు బాగా లేదని సిట్టింగ్‌లను ప్రజల్లోకి వెళ్లి గ్రాఫ్ పెంచుకునే అవకాశం కల్పించారు. నాడు సిఎం హెచ్చరిక తర్వాత కొద్దిరోజులు పార్టీ కార్యక్రమాల్లో శాసనసభ్యులు మునిగి తేలినట్లు కనిపించినా అధినేత ఆశించిన స్థాయిలో 20శాతం కూడా శాసనసభ్యులు గడప గడపకు వెళ్లలేకపోయారన్నది అక్షర సత్యం. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నికలకు వెళ్లే టీమ్(శాసనసభ్యులు) ఎంపిక చేసేందుకు జగన్ మొహమాటం లేకుండా గెలవలేనివారికి టిక్కెట్ ఇవ్వలేమని స ్పష్టం చేయడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో కనీసం ముగ్గురిని మార్చే అవకాశాలు లేకపోలేదని ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా ఇదేవిధంగా ప్రచారం జరిగినా సద్దుమనిగింది. తాజా పరిణామా లను పరిశీలిస్తే అన్నమయ్య జిల్లాలో లుకలుకలు వినిపిస్తున్నాయి. నెల రోజుల క్రితం కూడా స్వయంగా పి.కె. టీమ్‌తో పాటు అధికారపార్టీ మరో సర్వే చేయించి నట్లు తెలుస్తోంది. ఆ సర్వే నివేదిక శాసనసభ్యులకు కూడా పంపినట్లు తెలిసింది. ప్రధానంగా పార్టీ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లేవారికి సర్వేలు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏదో చేశామంటే చేసినట్లు పాల్గొన్నవారికి ప్రతికూలంగా ఉన్నట్లు సమాచారం. గడప గడపకు జగనన్న కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికి శాసన సభ్యులు వెళ్లినా జియోటాగింగ్ జరిగి సచివాలయ వ్యవస్థ ద్వారా సిఎంకు చేరుతోంది. శాసనసభ్యుల పనితీరు చిట్టా సచివాలయ వ్యవస్థకు లింక్ చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జగన్‌సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు ఇంటింటికి వెళ్లినా నియోజకవర్గాలకు గడప గడపకు జగనన్న కార్యక్రమం ద్వారా నిధులు వెంటనే మంజూరవుతున్నాయని అలా వెళ్లకుండా తూతూ మంత్రంగా వెళ్లేవారికి నిధులు మంజూరయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ విధంగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ముగ్గురు సిట్టింగ్‌లకు అవకాశం లేకపోవచ్చునని సమాచారం. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల పరిస్థితి ప్రత్యామ్నాయం కూడా అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఎవరు 'బెటర్' అని కూడా బేరీజు వేస్తున్నట్లు తెలుస్తోంది. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఓ నియోజకవర్గంలో పొత్తులో భాగంగా జనసేనకు దాదాపు ఇస్తారని ప్రచారం జరుగుతున్న స్థానంలో సిట్టింగ్ అభ్యర్థి మార్పు అనివార్యమని సమాచారం. అలాగే అన్నమయ్య జిల్లా ఏర్పాటు తర్వాత 2 నియోజకవర్గాల్లో కొత్త జిల్లా ప్రభా వంతో ఇద్దరు అభ్యర్థులు తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు నియోజక వర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం ఆచి తూచి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందిన సమాచారం. ఒక నియోజక వర్గంలో 2 మండలాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేపై స్థానిక నేతలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. గత ఎన్నికల్లో సిఎం వరకు ఈ సమస్య వెళ్లింది. ఈ ఎన్నికల్లో కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. దీన్ని అధిగమించేందుకు స్వయంగా ఎంపి మిథున్‌రెడ్డిని సిఎం రంగంలోకి దించారు. ఎంపి అసంతృప్తి నేతలతో చర్చలు జరిపారు. పరిస్థితి కొంతవరకు చక్కదిద్దారు కూడా. అయినా వారు ఎన్నికలు దగ్గరపడే కొద్ది పాత పాటే పాడుతుండడంతో అధిష్టానం పునరాలోచనలో పడినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఇక రెండు అధికార కేంద్రాలతో ఇద్దరు బలమైన నేతలతో అధికారపార్టీ పటిష్టంగా కనిపిస్తున్నా అంతర్గత అసంతృప్తిపై ఈ నియోజక వర్గంలో ఆందోళన వ్యక్తమవుతోంది. గతనెల 29న జరిగిన నియోజకవర్గ స్థాయి జెసిఎస్ సమావేశంలో రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టు ఉన్న ఓ నేత నియోజకవర్గ స్థాయి అధినేతకు మరలా టిక్కెట్ రావడం ఖాయం, గెలవడం ఖాయమని తాము మాట్లాడటంతో బహిరంగంగానే అదే వేదికపై ఉన్న మరో నియోజకవర్గ కీలకనేత సీరియస్ వార్నింగ్ ఇవ్వడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. టిక్కెట్ ఆశిస్తున్న మరో యువనేత ఇటీవల జరిగిన పుట్టినరోజు వేడుకల్లో నియోజకవర్గమంతా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టిక్కెట్ తనకేనంటూ చెప్పుకోవడం కూడా ప్రస్తుతం పార్టీ వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. గతంలో ఒక మండలానికే పరిమితమైన ఆ నేత ప్రస్తుతం అన్ని మండలాల్లో పర్యటిస్తుండడం పార్టీవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఏది ఏమైనా మరో 2 నెలలు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల్లోనే ఉండాలని అధినేత జగన్ ప్రకటించిన నేపథ్యంలో ప్రతికూల అంశాలను అనుకూలంగా మార్చుకునే సిట్టింగ్‌లకు మరలా ఛాన్స్ వస్తుందా? ఇంతలోపే అభ్యర్థులను ప్రకటిస్తారని కూడా రానున్న రోజుల్లో స్పష్టం కానుంది. ఏది ఏమైనా ముఖ్యమంత్రి జగన్ ప్రకటన సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కలకలం రేపినట్లే.

# ఎక్కడ చూసినా చంద్రబాబు చర్చే..!



రాజంపేట దీక్షలో జనసేన రాజంపేట పార్లమెంటు కన్వీనర్ ముకరం చాంద్



రాజమండ్రిలో భువనేశ్వరితో గంటా నరహరి

- **కోర్టు నిర్ణయాలపై ఆసక్తిగా అన్ని వర్గాల ప్రజలు**
- **తెదేపా ఆధ్వర్యంలో 15 రోజులుగా నిరసన దీక్షలు**
- **మరోప్రక్క నారా భువనేశ్వరితో వరుస భేటీలు**
- **జనసేన దోస్తీతో ఇరుపార్టీల్లో జోష్..**

అన్నమయ్య ప్రతినిధి, సెప్టెంబర్ 27(ప్రభాతవార్త)

తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై అన్నమయ్య జిలా ్ల వ్యాపితంగా సర్వత్రా చర్చ జరుగుతోంది. ఏ ఇద్దరూ మాట్లాడుకున్నా బాబుపైకే చర్చ వెళుతుంది. చంద్రబాబు వ్యవహారంలో అటు విజయవాడ ఎసిబి కోర్టులో, హైకోర్టు, సుప్రీంకోర్టుల్ ్ల జరుగుతున్న వాదనలు, కోర్టు తీసుకునే నిర్ణయాలపై అన్ని వర్గాల ప్రజ ఆసక్తి కనబరుస్తోంది. గత రెండు వారాలు పైగా చంద్రబాబు అరెస్టును తప్పించి మరో అంశానికి ఎవ్వరు కూడా ప్రాధాన్యత ఇచ్చి మాట్లాడడం లేదంటే అతిశయోక్తి కాదు. అలాగే చంద్రబాబుపై సిఐడి పోలీసులు పెడుతున్న కేసులకు సంబంధించి వివిధ వర్గాల ప్రజల మధ్య భిన్నాభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. అయితే తెదేపా వర్గాలు మాత్రం చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేకపోతున్నాయి. చంద్రబాబు అరెస్టుతో ప్రజల్లో సానుభూతి వెల్లువలా వస్తుందని, రానున్న ఎన్నికల్లో విజయం తమదే అన్న ధీమాతో ఉన్నారు. అధికార వైసిపి వర్గాలు మాత్రం చట్టం ఎవ్వరికీ చుట్టం కాదని చంద్రబాబు అరెస్ ్టను తప్పుపట్టడం సరైన చర్య కాదంటూ, అరెస్టుతో సానుబూతి వచ్చేటట్టుగా ఉంటే 2014 ఎన్నికల్లో వైసిపి ఓడిపోయేది కాదన్న అభిప్రాయంతో ఉన్నారు. చంద్రబాబు అరెస్టుకు సంబంధించి తెదేపా ఆధ్వర్యంలో గత 15 రోజులుగా జరుగుతొన్న నిరసనదీక్షల కంటే ఐటి ఉద్యోగులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలు ప్రజల్లోకి బాగా చొచ్చుకుపోయాయని చెప్పవచ్చు. అలాగే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో చంద్రబాబుతో ములాఖత్ అయ్యి రానున్న ఎన్నికల్లో తేదేపాతో పొత్తుపై కుండబద్దలు కొట్టడం చాలావరకు అటు జనసేన, ఇటు తెదేపా నేతల్లో జోష్ తీసుకొచ్చేలా చేసింది. అప్పటి నుండి జిల్లాలోని చాలా మండలాల్లో జనసేన, తెదేపా శ్రేణులు కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టడం, సమావేశాల్లో పాల్గొంటుండడం జరుగుతోంది. రాజంపేటలో తెదేపా ఆధ్వర్యంలో జరుగుతొన్న నిరసన దీక్షా శిబిరంలో జనసేన పార్లమెంటు కన్వీనర్ ముకరం చాంద్ బుధవారం పాల్గొని సంఘీభావాన్ని తెలియజేశారు. మరోప్రక్క రాజమండ్రిలో నారా లోకేష్ క్యాంప్ కార్యాలయంలో బస చేసి ఉన్న నారా భువనేశ్వరిని జిల్లాకు చెందిన తెదేపా నేతలు కలుసుకొంటూ తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ వస్తున్నారు. తాజాగా రాజంపేట పార్లమెంటరీ తెదేపా నాయకుడు గంటా నరహరి భువనేశ్వరిని కలుసుకోవడం జరిగింది. కాగా చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో ఎవ్వరికి తగ్గట్టు వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నప్పటికి రానున్న ఎన్నికల్లో ఈ వ్యవహారమే ప్రజల్లో ప్రధాన పాత్ర పోషిస్తుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోప్రక్క నారా లోకేష్ యువగళం పాదయాత్ర తిరిగి ప్రారంభించేందుకు సన్నద్ధమవుతుండగా లోకేష్‌ను కూడా అరెస్టు చేస్తారని వస్తున్న వార్తలతో రానున్న రోజుల్లో రాజకీయాలు ఏ విధంగా ఉండబోతున్నాయన్న సందిగ్దత వివిధ వర్గాల ప్రజల నుండి వ్యక్తమవుతోంది. మొత్తానికి తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టును అధికార వైసిపి మినహాయించి అన్ని రాజకీయపార్టీల నేతలు జిల్లాలో కూడా స్థానికంగా ఖండిస్తున్నారు. ఎన్నికల సమయంలో విపక్ష నేతలను అరెస్టు చేసి ప్రజలకు దూరంగా ఉంచాలనుకోవడం ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమన్న భావన వివిధ రాజకీయపక్షాల నేతలు అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు అరెస్టుకు సంబంధించి రాజకీయపక్షాలతో పాటు వివిధ వర్గాల ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ సాధారణ జనం మాత్రం సానుబూతి వైపే మొగ్గ చూపుతున్నారని చెప్పవచ్చు.

# ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం

## మైలవరం మండల స్త్రీశక్తిభవన్‌లో జగనన్నకు చెబుదాం మండలస్థాయి స్పందన కార్యక్రమం

### కలెక్టర్, జెసి, అసిస్టెంట్ కలెక్టర్, జమ్మలమడుగు ఆర్‌డిఒ హాజరు

కడప సెప్టెంబర్ 27,ప్రభాతవార్త

ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం అందించేలా.. రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం మైలవరం మండల స్త్రీ శక్తి భవన్ లో.. మండల స్థాయి "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు.. జేసీ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు.. హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా.. మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్ర వారాల్లో ఒక్కొక్క రోజు ఒక్కో మండలంలో.. "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమాన్ని నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామ స్థాయి సమస్యలు.. మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అయ్యేలా మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం అందించే దిశగా.. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అర్హతలు ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోలేని వారు.. వెంటనే వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ పథకాల లబ్ది పొందాలన్నారు. "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజల అర్జీలకు అధికారులు అందించే పరిష్కార నివేదికలు.. స్పష్టంగా ఉండాలని.. ఇందులో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైలవరం పట్టణ, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పులివెందుల బస్టాండుకు

# ఏపీ యాన్యువల్ టూరిజం ఎక్సలెన్స్ అవార్డు

### – మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న పులివెందుల డీఎం రామక్రిష్ణ



మంత్రి రోజా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఎం రామక్రిష్ణ

పులివెందుల, సెప్టెంబరు 27, ప్రభాతవార్త

పులివెందులలోని డాక్టర్ వైఎస్ఆర్ బస్ టెర్మినల్‌కు యాన్యువల్ టూరిజం ఎక్సలెన్స్ అవార్డు2023లో భాగంగా బెస్ట్ టూరిస్టు ఫ్రెండ్లీ బస్‌స్టాండు అవార్డు దక్కింది. విజయవాడలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో పర్యాటక శాఖ మంత్రి రోజా చేతుల మీదుగా పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజరు రామక్రిష్ణ, డీఈ పోతురాజులు అవార్డును అందుకున్నారు. వివిధ 40 కేటగిరిల్లో ప్రకటించిన అవార్డుల్లో ఏపీఎస్ఆర్టీసీ అవార్డును గెలుకుంది. గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పులివెందులలో కొత్తగా డాక్టర్ వైఎస్ఆర్ బస్ టెర్మినల్‌ను ఆధునిక సదుపాయాలతో, సౌకర్యాలతో 2022 డిసెంబరులో ప్రారంభించారు. ఇక్కడ టూరిస్టుల అవసరాలకు అనుగుణంగా వేయి ఉండేందుకు ఏసీ, నాన్ ఏసీ విశ్రాంతి గదులు, క్యాంటిన్లు, పర్యాటక ప్రాంతాల గురించి తగు సమాచారాన్ని తెలిపే ప్రత్యేక బోర్డులు, సమాచార కౌంటరు, ప్రయాణికుల కోసం ప్రతి ప్లాట్‌ఫాం నందు కుర్చీలు ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి కల్పించారు. దివ్యాంగులకు, విద్యార్థులకు, మహిళలకు ఇతరత్రా మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో బెస్ట్ టూరిస్టు ఫ్రెండ్లీ బస్టాండు అవార్డును డాక్టర్ వైఎస్ఆర్ బస్ టెర్మినల్ సొంతం చేసుకుంది. ఈ అవార్డు రావడం పట్ల సంస్థ ఎండీ సి.హెచ్.ద్వారకా తిరుమల రావు ఆనందం వ్యక్తంచేయడంతో పాటు అధికారులను అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి

## పులివెందుల ఉద్యాన అధికారికి ఉత్తమ విస్తరణ సేవల అవార్డు

పులివెందుల ఉద్యానశాఖ అధికారిగా పనిచేస్తున్న గువ్వా రాఘవేంద్రారెడ్డికి ఉత్తమ విస్తణ సేవల అవార్డు దక్కింది. తెలంగాణలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయంలో యూనివర్శిటీ ఆడిటోరియంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సదరణ రీజియన్, హైదరాబాదు వారు నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెక్ట్స్ జనరేషన్ ఎక్స్‌టెన్షన్ ఫర్ ఎవాల్వింగ్ రీ సైలెంట్ అగ్రి ఎకో సిస్టమ్స్ అనే అంశం మీద జాతీయ స్థాయి సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినర్‌లో దక్షిణాది రాష్ట్రాలలో వ్యవసాయ, అనుబంధ శాఖలలో ఉత్తమ విస్తరణ సేవలను అందించిన అధికారులకు అవార్డులు అందించారు. రాష్ట్రంలోని ఉద్యానశాఖ తరపున ఉత్తమ విస్తరణ సేవలను అందించినందుకు పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డికి ఉత్తమ విస్తరణాధికారి అవార్డు దక్కింది. ఈ అవాడ్డును డైరెక్టర్లు ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, సుధారాణి, ప్రొఫెసర్ సుధామతేజ, తదితరుల మీదుగా అందుకున్నారు.

# రైతుల బాధలు పట్టని సీఎం జగన్

### – దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి
### – మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :

రాష్ట్రంలో రైతుల బాధలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏ మాత్రం పట్టలేదని తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. లింగాల మండలంలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న టమోట పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల సక్రమంగా కల్వర్టు, హైలెవెల్ బ్రిడ్జిలు కట్టకపోవడం వల్ల కురిసిన వర్షాలకు పొలాల్లోకి నీరు వచ్చి చేరిందని, దానివలన టమోట పంటలు దెబ్బతిన్నాయన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే పంట నష్టం జరిగితే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కానీ, అధికారులు కానీ దెబ్బతిన్న పంటలను పరిశీలించలేదన్నారు. మన ప్రాంత రైతులను మనం ఆదుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఈ రోజు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాల్సి న బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉందన్నారు. సత్వరమే దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని చెల్లించి రైతులను ఆదుకోవాలని తెదేపా తరపున బీటెక్ రవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గడ్డం అమర్‌నాథ్, సింహాద్రిపురం మండల ఇన్‌ఛార్జి జోగిఎడ్డి, పులివెందుల ఆర్టీఎస్ ఇన్‌ఛార్జి వర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# చంద్రబాబుకు మద్దతుగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు

## ప్రార్థనల్లో టిడిపి, జనసేన నాయకులు సంఘీభావం

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ బుధవారం బెంగుళూరు బస్టాండులోని టిడిపి పార్టీ కార్యాలయంలో ముస్లిం మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీరు ప్రార్థనలకు తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి, జనసేన నియోజకవర్గ నాయకులు శ్రీరామ రామాంజనేయులు, దారం అనితలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం రాజకీయ కక్షతోనే నారా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. చంద్రబాబునాయుడును విడుదల చేసేంతవరకు దశలవారీగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ప్రజావ్యతిరేక విదానాలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి రోజులు దగ్గరపడుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు జంగాల శివరామ్, అడప సురేంద్ర, జగదీష్, హరిప్రసాద్, గోపాలక్రిష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, శివ, రెడ్డిబూ తదితరులు పాల్గొన్నారు.



## క్యాబినెట్ ఆమోదం హర్షనీయం

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



బుడగ జంగాలను ఎస్సీలో కలిపేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమని బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు వైసీపీ యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి అన్నారు. బుధవారం కడప నగరం పోస్టాఫీస్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు పాల్గొని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాసీమ బాబు మాట్లాడుతూ బేడా బుడగ జంగం వారికి క్యాస్ట్ సర్టిఫికెట్లు అందిస్తానని పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం శాసన సభలో తీర్మానించడం సంతోషమన్నారు. బేడా బుడగ జంగం నాయకులు పస్తం అంజి మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి తమకు కుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఈ విషయం మా రాష్ట్ర అధ్యక్షులు యలవర్తి మధు అనేక సార్లు ప్రభుత్వానికి, రాష్ట్ర సీఎంకు విన్నవించడం జరిగిందన్నారు. ఇందుకు సహక రించిన ఎంపీ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, మాసీమ బాబు, రాష్ట్ర అధ్యక్షులు యలవర్తి మధుకు పస్తం అంజి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్షుమయ్య, ఆంజనేయులు, రాముడు, జమ్మయ్య, సయ్యన్న, శంకర్, పెదన్న, అర్జునయ్య, వెంకటయ్య, నలప్ప, ఆంజనేయులు, చిన్న వెంకటయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

## రైతన్నలను ఆదుకోని జగన్ సర్కార్

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



రైతులను ఏమాత్రం జగన్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, కడప అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డిలు విమర్శించారు. కేసీ కెనాల్ కింద కడప జిల్లాలో 90వేల ఎకరాలు సాగుతుందని ఆయకట్టు ప్రాంతానికి నీటిని విడుదల చేయలేదని దుయ్యబట్టారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబరు మొదటి వారంలో రైతులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. బుధ వారం కడప వీహెచ్‌పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17 నఉుంచి అక్టోబరు 2 వరకు శివ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కడప జిల్లా ఇన్‌ఛార్జి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు చలపతి, లక్ష్మీనారాయణరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, రామకృష్ణారెడ్డి, హరినారాయణ, బొమ్మన విజయ్, పవన్‌కుమార్, మునగా సతీస్, రంగ ప్రసాద్, శాలివాహన అనంత కేశవ, కల్యాణ్, పద్మావతి భాయ్, శారద, శోభాయ్, చంద్రమోహన్‌రెడ్డి, రామాంజ నేయులురెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్ఆర్ఐటీకి అటానమస్

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ స్టేటస్ లభించిందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ముఖ్యంగా ఒక ఇంజినీరింగ్ కాలేజీకి అటానమస్ రావాలంటే 10 సంవత్సరాలు పూర్తి కావడం, యూజీసీ 2(ఎఫ్) రికగ్నైజేషన్, ఎన్ఏఏసీ, ఎన్‌బీఏ అక్రిడేషన్ ఉండి నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఉండడం వలనే మా కళాశాలలకు 2023–24 ఈ అకడమిక్ నుంచి అటానమస్ స్టేటస్ ఉంటుందని తెలిపారు. కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ మా కళాశాలకు అటానమస్ స్టేటస్ లభించడం గర్వ కారణమన్నారు. సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## చంద్రబాబును విడుదల చేయాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 27, ప్రభాతవార్త

ప్రజల మనిషి, ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న అపర భగీరథుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడును అన్యాయంగా అరెస్టు చేసి అబాసుపాలు చేయాలని దృష్ట తలంపుతో కేసుల మీద కేసులు బనాయిస్తూ బాధపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆయనను విడుదల చేయాలని జమ్మల మడుగు నియోజకవర్గ ఎస్సీ సెల్ కమిటీ స్థానిక ఎంఆర్‌ఓకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎనియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ అధ్యక్షుడు బీరు నెల్సన్‌కుమార్, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ (కాశీ), సోషల్ మీడియా హరికృష్ణ, నాగార్జున, పాపోడు, లక్ష్మీ నారాయణ, సురేష్, చంద్రశేఖర్, విజయ్, నారాయణ స్వామి, నందు, శంకర్ తదితరులు పాల్గొని నినాదాలు చేశారు.

## సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఏపీ ఎన్జీవో సంఘ నేతలు

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

ఇచ్చిన మాట కోసం కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం అసెంబ్లీలో చట్టం ఆమోదించి నందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ ఎన్జీవో సంఘం నేతలు కృత జ్ఞతలు తెలిపారు. బుధవారం కడపలో ఆ సంఘం కార్యాలయంలో ఏపీ ఎన్జీవో సంఘం కడప జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవిశంకర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి రెగ్యులర్ కాకుండా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలనే విషయంపై అనేక పర్యాయాలు జగన్ ప్రభుత్వంతో రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి చర్చలు జరిపారని గుర్తు చేశారు. సీఎంని ఒప్పించి నందుకు వారికి ధన్యవాదాలు తెలి పారు. కాంట్రాక్టు ఉద్యోగుల కలసాకారం అవుతున్న వేళ శుభాభినందనలు తెలిపారు.

## సదస్సును జయప్రదం చేయండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

సామాజిక న్యాయమైన మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకై వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న కడపలో జరప తలపెట్టిన రాయలసీమ జిల్లాల మాదిగల విశ్వరూప పాదయాత్రల సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమా ఖ్య జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దాదాపు 3 దశాబ్దాలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్నా పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా వర్గీకరణ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## కడప అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాలి

– కరణం రామ్మోహన్ చౌదరి

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త



కడప నియోజకవర్గంలో తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అక్రమ కేసులో ఎలా పెట్టారో ప్రజలకు వివరిస్తూ కడప పట్టణంలో 44వ డివిజన్‌లో కడప అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఆర్.మాధవిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ ఇన్‌ఛార్జి ఖాజాపీర్ అధ్యక్షతన జరిగిన బాబుతో నేను కార్యక్రమంలో 44వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి తెదేపాకు మద్దతు తెలపాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అసెంబ్లీ పరిశీలకులు కరణం రామ్మోహన్ చౌదరి కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంగంపేట పునరావాస గ్రామాల లేఅవుట్ పనులు వేగవంతం



ఓబులవారిపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలోని పొల్యూషన్ కోరల్లో కొట్టు మిట్టాడు తున్న ఆ నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలుసుకున్న కలెక్టర్ గిరీష బుధవారం పునరావాస గ్రామాలకు సంబంధించిన ఇంటి స్థలాల లేఅవుట్ పనులను ప్రారంభించి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆపేది లేదని సురక్షిత ప్రాంతాలకు ఆ నాలుగు గ్రామాలను తరలించి గ్రామస్థులకు ఇంటి స్థలాలకు ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారం వచ్చే నెల ఆఖరుకు నిధులు మంజూరు చేస్తామని అందులో ఎటువంటి సందేహం లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పుల్లారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పీర్ మున్ని, ఆర్ఐ రామ్మోహన్, స్థానిక వైసీపీ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, తల్లెంవెంకట రమణారెడ్డి, పుల పుత్తూరు రామ సుబ్బారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ హరిబాబు, కొలూరు మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సిగమాల రామచంద్రారెడ్డి, వాసురెడ్డి, దేవారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, చిన్న ఏపీఎండీసీ అధికా రులు, సీపీఓ సుదర్శన్‌రెడ్డి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## కొనిరెడ్డికి వైఎస్ జగన్ పరామర్శ

ప్రొద్దుటూరుఅర్బన్ సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



వైఎస్సార్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరామర్శించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రిని అసెంబ్లీ ప్రాంగణంలో శివచంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న శివచంద్రారెడ్డిని ముఖ్యమంత్రి ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని వాకబు చేశారు. పంచాయతీ పరిధిలోని సమస్యలతో పాటు పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తనతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకోవడం పట్ల శివచంద్రారెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత కంటివైద్య శిబిరం

ప్రిన్సిపాల్ ఎస్‌బి. సురేష్‌బాబు

మైదుకూరు సెప్టెంబర్ 27, ప్రభాతవార్త




శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏపీ వెంకట శివ, జాయింట్ సెక్రటరీ భూమిరెడ్డి రవి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన కంటి వైద్యం రక్తధాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మైదుకూరులోని వనిపెంట రోడ్‌లో ఉన్నటువంటి శ్రీ బాల శివ యోగేంద్ర మహరాజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ బి సురేష్ బాబు, వైస్ ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భూమిరెడ్డి రవికళ్యాణ్ ఆధ్వర్యంలో కళాశాలలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులచే రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మైదుకూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు ఉచితంగా రక్తాన్ని అత్యవసర సమయంలో గర్భిణీ లకు అత్య వసర పరిస్థితిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఈ రక్తం ఉపయోగపడుతుందని శ్రీ బాల శివ కళాశాల ఉపాధ్యాయ బృందం ఆలోచించి విద్యార్థులతో చర్చించి సమాజసేవలో భాగంగా రక్తదానం చేయడం జరుగుతుందని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా అనేక మంది జీవితాలను రక్షించిన వాళ్ళం అవుతామని ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని పునర్జన్మగా ప్రాణం పోసి బతికించిన వారమవుతామని అవసరమైనంతవరకు మన ప్రయత్నం మనం చేయాలని అది కూడా సమాజసేవ దేశభక్తిలో భాగమని తెలిపారు.

## ఆస్తానే పతుమియా ఉరుసు మహోత్సవం

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



సిద్దవటం మండలంలోని ఆస్తానే పతుమియా ఉరుసు మహోత్సవంలో తెదేపా సీనియర్ నాయకులు వి.ఎస్.అమీర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని ఆ భగవంతుని ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరికి ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, ముస్లిం మైనార్టీ మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## కొనసాగుతున్న రిలే దీక్షలు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:




కడప నియోజకవర్గంలో పాత శారదా నిలయం హైస్కూలు పక్కన కడప అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఆర్.మాధవి రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు తోడుగా ఒక నియంత పాలనపై పోరాటం కోసం మేము సైతం రిలే నిరాహారదీక్షకు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అధ్యక్షతన టీఎన్ఎస్ నాయకులకు, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప పరిశీలకులు కరనం రామ్మోహన్ చౌదరిలు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్ చౌదరి మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా, కుతంత్రాలు పన్నినా అక్రమ కేసులు పెట్టినా మా అధినేత చంద్ర బాబు బయటకు వస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులే..

సంబేపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త



వైసీపీ ప్రభుత్వం తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడుపై కక్ష సాధింపులు సాగిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి తెలిపారు. బుధవారం అడవికమ్మపల్లెలో అక్రమంగా కేసులు బనాయించి మచ్చ లేని నాయకుడిని బయటకు రాకుండా చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణ పాఠం చెబుతారన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు బయటకు రావాలని కోరుతూ బాబుతో మేము సైతం పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల వద్ద అన్నదానానికి విరాళం

సంబేపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

సకల విఘ్నాలకు అధిపతి అయిన గణేష్ ఆశీస్సులతో ప్రజలు ఎల్లవేళలా సుభిక్షంగా ఉండాలని ఏపీ బీసీ చైతన్య సమితి ఎన్ఆర్ఐ ప్రెసిడెంట్ తురక వెంకట సుబ్బయ్య ఆకాంక్షించారు. మండల పరిధిలోని పలు వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. భగవంతుని కృపతో భవిష్యత్తులో మరింత సేవ చేస్తానని ఆయన తెలిపారు.

## త్వరలో అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఆధునీకరణ పనులు

దేవాలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరుఅర్బన్ సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



సెప్టెంబర్ 30వ తేదీతో 2000 రూపాయలు రద్దవుతున్న తరుణంలో భక్తులు అగస్త్యేశ్వర స్వామి ఆలయ హుండీలో వేస్తే వినియోగించాలనే ఉద్దేశ్యం తోనే హుండీ లెక్కింపు ప్రత్యేకంగా చేపట్టామని అగస్త్యేశ్వర స్వామి దేవాలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ భక్తులు ఎవరైనా అగస్త్యేశ్వర స్వామి వారికి భక్తితో 2000 రూపాయల నోటు సమర్పిస్తే వాటిని వినియోగించేందుకే ప్రత్యేకంగా హుండీ లెక్కింపు ఈఓ శంకర బాలాజీ, ప్రత్యేక అధికారుల సమక్షంలో చేపట్టామని తెలిపారు. రామే శ్వరం దేవాలయం తరహాలోనే ఆలయ మూలవిరాట్టును కదపకుండా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో రాళ్లు వున్న చోటే ఆలయాన్ని తయారు చేయించి ఇక్కడ ఏర్పాటు చేసేలా ఆలయ స్థపతి, కమిషనర్ ల అనుమతి, ప్లాన్ ప్రకా రం చేయనున్నామని తెలిపారు. శివాలయ అభివృద్ధికి సంబంధించి ప్రస్తుతం ఆ స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారు కచ్చితంగా కాంట్రిబ్యూషన్ ఇవ్వాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మల్లికార్జున శెట్టి, గోవర్ధన రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటిన బలిజ సేవా సంఘం అధ్యక్షులు

బద్వేలు అర్బన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్‌లో ఉన్న సూర్యగిరి మృతి చెందడం పట్ల వారికి కుటుంబ సభ్యులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో విషయం తెలుసుకున్న బలిజ సేవా సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు (డీవీ) పెరుగు వెంకటయ్య దద్దం నాగార్జున, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, పలువురు వెంటనే స్పందించి సూర్య గిరి అంత్యక్రియల కార్యక్రమం వారి చేతుల మీదుగ చేపట్టారు. బలిజ సేవా సంఘంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వారి సమస్యలు పరిష్కరించేలా తాము ఎప్పటికీ అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో సురేంద్ర, వెంకటసుబ్బయ్య, సుధాకర్, సుబ్బయ్య, శ్రీను, అడ్వకేట్ నరసింహులు, రమణ పాల్గొన్నారు.

## శివాలయం హుండీ ఆదాయం రూ. 3లక్షలు

ప్రొద్దుటూరుఅర్బన్ సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



పట్టణ నడిబొడ్డున వెలిసిన అగస్త్యేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఈఓ శంకర బాలా జీ, నంద్యాల ఇన్స్పెక్టర్ శశి కుమార్, ఆలయఅర్చకులు, సిబ్బం ది ఆధ్వర్యంలో జరిగింది. 6 నెలల కాలానికి గాను 3,000,826 రూపాయలను భక్తులు కానుకల రూపంలో అందించారని ఈఓ, ఇన్స్పెక్టర్ తెలిపారు.

## ఘనంగా ఆసారె షరీఫ్ ఉరుసు మహోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలోని ఆసారే షరీఫ్ దర్గా ఉరుసు మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మంగళవారం గంధం మహోత్స వము బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సంద ర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్రూట్ మర్చంట్ దంతుమీయ అండ్ సన్స్ అధినేత 25 వ వార్డు టిడిపి ఇంచార్జ్ ఖాదర్ వల్లి వారి కుటుంబ సభ్యులు షఫీ ఉల్లా, రబ్బాని, మౌలా, నూర్, ఆరాఫత్ తదితరులు వేడుకలలో పాల్గొన్నారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టును వివరిస్తూ కరపత్రాల పంపిణీ

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును "బాబుతో నేను" అంటూ ప్రజలకు వివరిస్తూ పట్టణంలోని 37వ వార్డులో టిడిపి ఇంచార్జ్ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఇంటింటి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టిపాటి గంగాధర్, వద్ది బాలుడు, కె.వి. కృష్ణారెడ్డి, మోతుకూరు వెంకటసుబ్బయ్య, దొరసానిపల్లె చెంద్రా రాయుడు, చంటి పొట్టిపాటి, మద్దూరి నరసింహులు, రామకృష్ణ నీలాదర్ రామచంద్రుడు, ఆంజనేయులు, తిరుపాలు, రాజుపాలెం మండల కన్వీనర్ దనిరెడ్డి విశ్వ నాథరెడ్డి, మేరువ మూర్తి, 38 వార్డ్ ఇట్టే సునీల్ కుమార్, పాణ్యం సుబ్బా రాయుడు, భోగాల లక్ష్మీనారాయణమ్మ, 40 వార్డ్ లక్ష్మీదేవి, మధుబాబు, నాగ సుబ్బారాయుడు, పెన్నా నగర్ మజీద్, 14వ వార్డు మస్తాన్ గోలే, చంద్రశేఖర్, అమృత నగర్ పాల సుబ్బరాయుడు ,అఖిల్, మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యాటక దినోత్సవం

మైదుకూరు సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చరిత్ర శాఖ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భంగా విద్యార్థులకు పర్యాటక ఆవశ్య కతను, పర్యాటక వలన 'మానవాలికి కలిగే ప్రయోజనాలను, వివరించటం జరిగింది. ప్రిన్సిపాల్ పి. నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు టూరిజం విశేషాలు, ఆయన అమభవాలను విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. చరిత్ర శాఖ నిర్వాహనతో జరిగిన ఈ సమావేశంలో చరిత్ర అధ్యాపకులు పి.రామేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు పి.వి కృష్ణారెడ్డి, కె. సుబాన్ సాహేబ్, బి. సుబ్బారాయుడు, కె. రాధారామ్, పి. చెంద్రాయుడు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

మైదుకూరు సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని చాపాడు మండల సూపర్వైజర్ సుబ్బ రత్నమ్మ అన్నారు మంగళవారం మండల పరిధిలోని విశ్వనాథ పురంలో బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు నిర్మూలించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మగ పిల్లవానికి 21 సంవత్సరాలు ఆడపిల్లకు 18 సంవత్సరాలు వయస్సు నిండి ఉంటేనే వివాహం చేయాలని లేదంటే చేసినవారికి ప్రోత్సహించిన వారికి చర్యలు తప్పవని అన్నారు అన్ని రంగాల్లో ఆడపిల్లలు ముందంజలో ఉన్నారని ఆడపిల్లలకు వివాహాలు వద్దు చదివే ముద్దు అన్న నినాదానంతో ముందుకు వెళ్లాలని అన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

## వైవీయూ సీడీసీ డీన్‌గా ఆచార్య రఘుబాబు బాధ్యతల స్వీకరణ

వైవీయూ సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



యోగివేమన విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా ఆచార్య కె. రఘుబాబు బాధ్యతలు స్వీకరించారు. జియాలజీ డిపార్ట్ మెంట్ ఆచార్యులైన రఘు బాబు సిడిసి డీన్ కార్యాలయంలో పూర్వపు డీన్ ఆచార్య వై.సుబ్బరాయుడు నుంచి బాధ్యతలు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలల అభి వృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య రఘుబాబును ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్ రఘునాథరెడ్డి, పాలకమండలి సభ్యురాలు డా మాదక్క, ఆచార్యులు ఎన్. ఈశ్వర్ రెడ్డి, ఏజీ దాము , కె గంగయ్య, ఎంవి శంకర్, మోహన్ రాజు, సహా య ఆచార్యులు, సహ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## డబ్ల్యూఎన్ఎస్ సంస్థతో యోగివేమన ఎంఓయు

వైవీయూ సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



యోగివేమన విద్యాలయం ముంబై కి చెందిన డబ్ల్యు ఎన్ ఎస్ గ్లోబల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ తో ఎం ఓ యు( మెమొరాండమ అండర్స్టాండింగ్) కుదుర్చుకుంది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్ రఘు నాథరెడ్డి, సి డి సి డిన్ ఆచార్య రవిబాబు, డాక్టర్ సుబోష్ చంద్ర, కమ్యూనిటీ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్ వి.సి. సంపత్ కుమార్ లు కలిసి ఆన్లైన్లో ఎం ఓ యు పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ 12 దేశాలలో ఆ సంస్థ సేవలు అందిస్తోంది అన్నారు పోటీ ప్రపంచంలో ఇన్నోవేటివ్ ప్రోగ్రామ్స్, కాంపిటీటివ్ జాబ్ మార్కెట్ తగ్గట్టుగా విద్యార్థులకు నైపుణ్యాలు, జ్ఞానాన్ని ఆన్లైన్ ద్వారా అందిస్తుందన్నారు.

## నిరాశ్రయులకు సగల సుబ్బరాయుడు చేయూత

బద్వేలు అర్బన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త



పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో ఉండే ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని అనాథ వృద్ధులకు బుధవారం భాగ్య లక్ష్మీ ఫర్టిలైజర్స్ యజ మాని సగల వెంకట సుబ్బ రాయుడు జన్మదినో త్సవం పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు సగల కృష్ణవేణమ్మ, కుమా రుడు సగల సుబ్బరాయుడు కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. విద్యుత్తు సామగ్రికి అవసరమైన రూ.15 వేలు నగదును కూడా అందజేశారు. అనంతరంసుబ్బ రాయుడు మాట్లాడుతూ ఆసరా కోల్పోయిన అనాథ వృద్ధులకు ప్రతి ఏడాది తమ జన్మదినోత్స వం పుర స్కరించుకొని చేయూతనివ్వడం ఆనందదాయకమన్నారు.

## ఉద్యోగుల జీవితాల్లో చీకటి రోజు

ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరుఅర్బన్ సెప్టెంబర్ 27,ప్రభాతవార్త

ఉద్యోగులకు ఇష్టంలేని జిపిఎస్ పించను పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ఆమోదించినందుకు వారి జీవితాల్లో చీకటి రోజుగా మిగిలి పోయిందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపిఎస్ రద్దు చేసిన రాష్ట్రాలు దివాలా తీసాయని ఆర్థిక శాఖ మంత్రి చొప్పున విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో ఓపిఎస్ అమలు చేస్తున్న పశ్చిమబెంగాల్, పంజాబ్‌తో పాటు మరెన్నో రాష్ట్రాలు దివాలా తీయలేదే అని ప్రశ్నించారు. ఓపిఎస్ అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఫ్యామిలీ పింఛను, గ్రాట్యుటీ వంటివి అమలులో లేకున్నా పాత పించను అమల చేస్తున్నాయని, మన రాష్ట్రంలో గత ప్రభుత్వంలో సిపిఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పింఛను గ్రాటిటూ సౌకర్యాలు లభించాయని ఇప్పుడు కేవలం సర్వీసు పించను మాత్రమే ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుత ప్రభుత్వం అది కూడా ఇవ్వకుండా చేతులెత్తేయడం శోచనీయమన్నారు. జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్ష ధోరణిగా వ్యవహరించిందన్నారు. ఇప్పటి వరకు ఉద్యోగుల అభ్యర్థనలు, ఆవేదనలు చూశారని రాబోవు కాలంలో వారి పోరాటాలు కూడా చూడబోతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో ఉద్యోగులు తమ ఓటు ద్వారా నిరంకుశ పాలకులకు తగిన బుద్ధి చెబుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

దువ్వూరు, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరు పోలీసు స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. దువ్వూరు పరిధిలో లా అండ్ ఆర్డర్‌ను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలీసుల నివాస గృహాల స్థలంపై ఆరాతీశారు.

## సేవా పక్వాడలో భాగంగా రక్తదాన శిబిరం

కడప సెప్టెంబర్ 27,ప్రభాతవార్త



ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప ఎన్ఎస్ఎస్ విభాగం వారు సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని కళాశాలలో రిమ్స్ డిఎంహెచ్ఓ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్ర నాథ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణధానమని రక్తం దానం చేయడంలో యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడమే కాకుండా ఇతరుల చేత కూడా రక్తదానం చేయాల్సిందిగా పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైవి యూనివర్సిటీ ఎన్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి డీఎంహెచ్ఓ డిస్టిక్ మేనేజర్ భాస్కర్ పివి ప్రసాద్ పెంచలయ్య రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్, జిల్లా నెహ్రూ యువ కేంద్ర డైరెక్టర్ వి మణికంఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా వై సావిత్రి, శివ రామ కృష్ణ , డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ సావిత్రి జంతు శాస్త్ర శాఖ ఇంచార్జి డా. రవిశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు

## జాతీయ బిసి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరుఅర్బన్ సెప్టెం



జాతీయ బిసి సంక్షేమ సంఘం నా మేరకు జాతీయ బిసి సంక్షేమ సంఘం కున్నట్లు నూతన కమిటీ సభ్యులు బుధవా పారు. జిల్లా కార్యవర్గం గౌరవాధ్యక్షులుగా సందు శివ నారాయణ, రామేశ్వరం ప్రభు కుమార్, జిల్లా కన్వీనర్ గా బడబాగ్ని వెంకట రమణ రాజు, ప్రధాన కార్యదర్శిగా జింకా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా జింకా జయప్రకాశ్, పాలగిరి సుధాకర్ రాజు, సంయుక్త కార్యదర్శిగా బడబాగ్ని రమేష్ రాజును ఎన్నుకున్నట్లు వివరించారు. వీరితో పాటు జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ గా బడబాగ్ని వెంకట రమణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కత్తి విజయకుమార్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరందరికీ జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంగళరావు నియామక పత్రాలు అందించారని పేర్కొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షకు సమయాత్తమవండి

– ఎంపీడీవో సురేంద్రనాథ్



తంబళ్లపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వైద్య సిబ్బందితో పాటు అధికార యంత్రాంగం సమయాత్తం కావాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అనుపమతో కలిసి బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీలో ముమ్మరంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి పలు రకాల వైద్య పరీక్షలతో పాటు కార్పొరేట్ స్థాయి వైద్యం రూపాయి ఖర్చు లేకుండా జరుగుతుందన్నారు. సచివాలయ పరిధిలో జరిగే ఈ వైద్యశిబిరంలో నలుగురు ఉన్నత స్థాయి వైద్య నిపుణులతో పాటు ఖరీదైన వైద్య పరికరాలతో పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందస్తుగా వైద్య సిబ్బంది గ్రామాలలో సర్వే నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులు, ఇంకా పలు రకాల వ్యాధిగ్రస్థులను గుర్తించి వైద్య శిబిరానికి తరలించడానికి చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ప్రజా ప్రతినిధులు, సచివాలయ యంత్రాంగం, వాలంటీర్లు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి తమ వంతు పూర్తి సహకారం అందించాలని కోరారు. వారి వవెంట కార్యదర్శి రంజిత్, వివేకానంద, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోండి



తంబళ్లపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని ముందస్తుగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఓఆర్‌డబ్ల్యూ కళావతి సూచించారు. బుధవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో కృషి స్వచ్ఛంద సేవా సంస్థ సారథ్యంలో తంబళ్లపల్లె పోలీసు స్టేషన్‌లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పలువురికి టీబీ, హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర, రమణ, కృషి సంస్థ సభ్యులు సావిత్రి, పీఈ గౌతమి, ఏఎన్ఎం చంద్ర, నాగమ్మ, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

– ఎస్పై ఎస్.కె.రహీముల్లా

కలికిరి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



ట్రాక్టర్లకు వారి యజమానులు తప్పనిసరిగా అన్ని వైపులా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పై ఎస్.కె.రహీముల్లా తెలిపారు. బుధవారం కలికిరిలో జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై ట్రాక్టర్ యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పై మాట్లాడుతూ ట్రాక్టర్లలో ప్రయాణికులను తరలించరాదన్నారు. అలాగే ట్రాకర్లలో ఓవర్ లోడు వేసుకొని నడపకూడదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలకు అతి పెద్ద శబ్దాలు ఇచ్చే సైలెన్సర్లను ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో దుండగులు వాహనాలు చోరీ చేసి రిపేరు కోసం వాహనాల మెకానిక్‌ల వద్దకు వస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఎస్పై తెలిపారు. డ్రైవర్లు కూడా కచ్చితంగా లైసెన్సులు కలిగి ఉండాలని ఎస్పై సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పై మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుల్ కొండప్ప, కానిస్టేబుల్ రాజా, హోంగార్డు నిజాముద్దీన్, ట్రాక్టరు యజమానులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– సర్పంచ్ ఎ.రెడ్డిరామ్

కలికిరి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ప్రజలకు సూచించారు. బుధవారం మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో ఎంఎల్‌హెచ్‌పీ షాహీదా టీం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని నిర్వహించారు. ఈ సర్వేలో స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్ పాల్గొన్నారు. జగనన్న సురక్ష సర్వేపై ఎంఎల్‌హెచ్‌పీ షాహీదా ప్రజలకు అవగాహన కల్పించి ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి మండలంలో జరగనున్న వైద్య శిబిరంలో స్పెషలిస్టుల ద్వారా చికిత్సలు అందించే విధంగా రోగులకు టోకెన్లు ఇచ్చారు.

## అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం



రామసముద్రం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :

రామసముద్రంలోన ఆంజినేయస్వామి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక చవితికి వినాయకుడుని బుధవారం కోలాహాలంగా వినాయక స్వామి విగ్రహ ఊరేగింపు నిమజ్జనం జరిగింది. స్థానిక కాలనీ వాసులు ఎంతో భక్తిశ్రద్దలతో బొజ్జగణపయ్య విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ట్రాక్టర్‌పై వీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్ళారు. బొజ్జగణపయ్య ముందు శ్రీవారినగర్ వాసులు బళ్ళారిడ్రమ్స్, కొలాటాలు, డాన్సులతో రంగులు చల్లుకొంటూ ఊరేగింపుగా వెళ్ళారు. అంబేద్కర్ సర్కిల్ నందు బాణసంచాపేల్చారు. తమిళనాడు నుంచి గారడి బొమ్మలు, కీలుబొమ్మలు, ప్రత్యేక ఆంజినేయస్వామిగా వినాయకుడు జైశ్రీరామ్ జైశ్రీరామ్ బజరంగ్ బజరంగ్ అంటూ భక్తులు పరవశించిపోయారు. అనంతరం వినాయకుని నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్ పర్యవేక్షణలో చెరువులో వినాయకుని నిమజ్జనం కార్యక్రమం జరిగింది.

## దివ్యాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

ఆర్డీఓ ఎంఎస్.మురళి

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. బుధవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో రూరల్ మండలం ఎనుములవారిపల్లెకు చెందిన ఏ.మల్లికార్జున అనే దివ్యాంగునికి ఆర్డీఓ ట్రైసికిల్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు మూడుచక్రాల వాహనం కావాలని ధరఖాస్తు చేసుకొన్న వెంటనే మంజూరు చేయడం జరిగిందన్నారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి పథకం అందజేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని దివ్యాంగులు ధరఖాస్తులు చేసుకుంటే పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏఓ శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినిని హత్యచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

బివైఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



ఇంటర్ విద్యార్థి భవ్యశ్రీని హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బుధవారం అంబేద్కర్ సర్కిల్ నందు బహుజన యువసేన(బివైఎస్) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బివైఎస్ అధ్యక్షులు పునిత్ మాట్లాడుతూ చిత్తూరుజిల్లా పెనుమూరులో ఇంటర్ చదువుతున్న విద్యారినిని ప్రేమిస్తున్నామంటూ ముగ్గురు వెంటబడి వేధించేవారన్నారు. ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి ఇంటినుంచి బయట తీసుకెళ్ళి హత్యాచారం చేసి కిరాతంగా హత్య చేయడం జరిగిందన్నారు. హత్యకు పాల్పడ్డవారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి మహిళలపై ఎలాంటి దాడులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికమంత్రి స్పందించకపోవడం భాదాకరమన్నారు. టిడిపి, జనసేన వారు కూడా స్పందించకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్, సంతోష్, గణేష్, నవీన్, సుధాకర్, జగదీష్, పూర్ణ పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులపై కొనసాగుతున్న దీక్షలు

చంద్రబాబుకు బెయిల్ వచ్చేవరకు నిరసనలు

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ మేము సైతంలో భాగంగా చేపడుతున్న రిలేనిరాహారదీక్షలు బుధవారం 14వ రోజు కొనసాగింది. చంద్రబాబు నాయుడుకు బెయిల్ వచ్చేవరకు రిలేదీక్షలతో పాటు నిరసనలు కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడును విడుదల చేసేంతవరకు ఈ ఉద్యమం కొనసాగిస్తామన్నారు. బావితరాల భవిష్యత్తు కోసం రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపేందుకు కష్టపడిన ఏకైక వ్యక్తి చంద్రబాబునాయుడే అన్నారు. అలాంటి వ్యక్తిని ఆధారాలు లేకుండా అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారన్నారు. రాజకీయ కక్షలకు పాల్పడుతున్న వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడుతున్నాయన్నారు. అనంతరం అక్రమ కేసుల నుంచి జైలు నుంచి బయటకు వచ్చిన రూరల్ అధ్యక్షులు శ్రీనివాసులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ నాయకులు ఆర్‌జె.వెంకటేష్, యువ నాయకులు యశ్వీరాజ్, చాణిక్యతేజ్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మెన్ భవానిప్రసాద్, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, జయమ్మ, మేకల రెడ్డిశేఖర్, ఎస్.ఎం.రఫి, గుత్తికొండ త్యాగరాజు, మోడెం సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు పాఠశాలలో గ్రహణ మొర్రి శిబిరం

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వెలుగు ప్రత్యేక పాఠశాలలో బుధవారం గ్రహణమొర్రి అరుదైన చికిత్స కొరకు స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. వెలుగు ప్రత్యేక పాఠశాల ఆవరణంలో సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బెంగుళూరు నందు ప్రముఖ వైద్యశాల కిందర్ ఉమెన్స్ ఆసుపత్రి వారిచే ఈ క్యాంపును నిర్వహించారు. ఇందులో 30మందిని గుర్తించగా 16మంది మాత్రమే అర్హులుగా నిర్ధారణ అయ్యారన్నారు. వీరని బెంగుళూరు నందు ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.కార్యక్రమంలో బెంగుళూరుకు చెందిన డాక్టర్ ఆకాష్, సర్వశిక్షా అబియాన్ నాగేంద్ర ప్రసాద్, విక్టరీ ఇండియా సిబ్బంది మోహన్,రాజా,వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి,సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నాగదేవతా విగ్రహ ప్రతిష్ట

మల్లెలచే అన్నదానం



రామసముద్రం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :

మండలంలోని నడింపల్లి పంచాయితీ బలసముద్రం గ్రామంలో నాగదేవతా విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగాయి. ఈ విగ్రహాలకు చుట్టపక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి పూజలు నిర్వహించారు. అర్చకులు లోకనాథం వేదమంత్రాలతో మహామంగళిహారతి, అభిషేకాలు నిర్వహించి శంకుస్థాపన గావించారు. ఈ ప్రతిష్టలో రెండురోజులుగా మల్లెల పౌండేషన్‌వ్యవస్థాపకులు మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నరేంద్ర, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆనంద, బాలు,ఆది, హరీష్, రెడ్డిశేఖర్, నంద, వాలెప్ప, ముని, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## మల్లయ్యకొండలో అరుదైన పాము

తంబళ్లపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండల సమీపంలోని మల్లయ్య కొండలో ఓ అరుదైన పాము భక్తుల కంట పడిం ది. బుధవారం మల్లయ్యకొండలో వీరన్న గెవికి వెళ్లే దారిలో భక్తులకు ఈ పాము దర్శనమిచ్చిం ది. ఈ పాము పూర్తిగా నల్లగా ఉండి తల ప్రాం తంలో అర్ధ చంద్రాకారంతో పోలి విచిత్రంగా కనపడి అందరినీ ఆశ్చర్య పరిచింది. ఈ వింత పామును చూడడానికి కొండపై దేవుని దర్శనానికి వచ్చిన భక్తులు ఎగబడ్డారు.

## సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకుందాం

వాల్మీకిపురం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:



భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని మన సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షించుకుందామని స్థానిక ఎన్టీఆర్ కాలనీ వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవంను పురస్కరించుకుని బుధవారం మండపం వద్ద విశేష పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వందలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన యువతకు ప్రోత్సాహక బహుమతులును అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రాజు, నవీన్, ఆంజి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ డ్రైవింగ్ చట్టరీత్యానేరం



వాల్మీకిపురం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:

మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యానేరమని అలా చేస్తే డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ సురేష్ అన్నారు. బుదవారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరనంలో మండల పరిధిలోని ట్రాక్టర్ డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను తప్పక డ్రైవర్లు పాటించాలన్నారు. డ్రైవర్లు ముఖ్యంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్‌చేయకుండా చూసుకోవలసిన అవసరం ఉందన్నారు. అలాగే ఇన్సూరెన్సు అప్‌డేట్ దగ్గర పెట్టుకోవాలని తమ ట్రాలీలకు ఎర్రరంగు రిఫ్లెక్టర్లు అతికించుకోవాలని సూచించారు. ఈనిబంధనలును పాటించని డ్రైవర్లు యజమానులు పైన చర్యలు తీసుకుంటామని సీఐ సూచించారు. ఈకార్యక్రమంలో ట్రాక్టర్ల యజమానులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ పండుగ

వాల్మీకిపురం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:

ఇస్లామిక్ సంవత్సరానికి మూడవ నెల అయిన రబీ ఆల్ అవ్వల్ 12వ తేదీ మహమ్మద్ ప్రవక్త జన్మదిన అన్ని పురస్కరించుకుని జరుపుకునే పండగ మిలాద్ ఉన్ నబీ పండుగని ముస్లీం మత గురువులు తెలిపారు. ప్రధానంగా ఈమాసంలో 12 రోజులు నిర్వహించే ఈకార్యక్రమంలో 11వ రోజు గంధం ప్రదర్శన, 12వ రోజు సామూహిక అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా పట్టణంలోని నాయక్ వీధి, కోనేటి వీధి, హసన్‌ఖాన్ వీదిలతో పాటు మండలంలోని వివిద ప్రాంతాలలో ని పీర్ల చావిడిలను విశేషంగా విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి ముస్తాబు చేశారు. అనంతరం రాత్రి ఆయా చావిడిలా ఆద్వర్యంలో విశేషంగా అలంకరించిన పుష్పపల్లకిలో గంధం తీసుకుని ముస్లీం మత పెద్దలు, యువత ప్రత్యేక గీతాలాపనలు చేస్తూ గంధం ప్రదర్శన నిర్వహించారు. దీంతో పట్టణంలోని ప్రధాన వీధులన్నీ ముస్లీంల గీతాలాపనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నేడు గురువారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి మిలాద్ ఉన్ నబీ పండుతను ముస్లీంలు ఘనంగా జరుపుకున్నారు.

## అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న

వాల్మీకిపురం, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఫైరోజాబేగం అన్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరనంలో ఈనెల 30వ తేదీ శనివారం ఉదయం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆరోగ్యవంతులై ఉండి 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న వారు ఈక్యాంపు నందు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఈఆరోగ్య మేళ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఈఆరోగ్యమేల కార్యక్రమంలో పాల్గొని రక్తదానంచేసి చేయించాలని సూచించారు.

## నవ రత్నాలలో ఒక రత్నమైన పేదలందరికి ఇల్లు

కలకడ, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:



ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంటులతో బుధవారం సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ ఎవరైతే అర్హులై ఉండి ఇల్లు లేని వారందరికి ఇల్లు ఇవ్వాలని సూచించారు. అలాగే పునాదులు పూర్తైన వారికి త్వరగా ఇళ్ల నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం అర్హత కలిగి ఉండి ఏ ఒక్కరు లబ్దిదారులు కూడా ఇల్లు లేదు అనకూడదు అనే లక్ష్యంతో పనిచేయాలని చెప్పడం జరిగింది. అలాగే మరుగుదొడ్ల కోసం అదనంగా ప్రభుత్వం 12000రూపాయలు చెల్లిస్తుందని ఇంకుడు గుంతలను కూడా 6000రూపాయలు చెల్లిస్తుందన్నారు. త్వరితగతిన నిర్మించుకునేలా లబ్దిదారులకు తెలియచేయాలని హౌసింగ్ ఏఈ రమణయ్య, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవిరవికుమార్ అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్‌పెక్టర్ నాగముని నాయక్,డీఏ ప్రతాప్‌లు పాల్గొన్నారు.

## పెనుమూరు విద్యార్థిని మరణంపై నిజాలు నిగ్గుతేల్చండి

ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం డిమాండ్



పీలేరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:

పెనుమూరు విద్యార్థిని మరణంపై నిజానిజాలు నిగ్గు తేల్చి మతురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమతతేజ ఆధ్వర్యంలో పీలేరులోని అంబేద్కర్ కూడలి నందు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా అమతతేజ మాట్లాడుతూ సెప్టెంబరు 17వ తేదీన బాధితురాలు కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో కంప్లయింట్ ఇస్తే నాలుగు రోజుల తరువాత స్థానిక ప్రజలు నిమజ్జనం కోసం ఒక బావి దగ్గరికి వెళ్తే అక్కడ బావిలో తేలాడుతున్న శవాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మతురాలు పెనుమూరి బాలిక అని నిర్ధారించుకున్నారు. తమ బిడ్డకు ఈత వచ్చు అని అలాంటి తమ బిడ్డ ఎందుకు ఆత్మహత్య చేసుకుంటుందని మతురాలి తల్లి పలు అనుమానాలు వ్యక్తం చేయడం జరిగింది. కావున పోలీసు వారు నిష్పక్షపాతంగా నిజానిజాలు నిగ్గు తేల్చి మృతురాలి కుటుంబానికి అండగా నిలవాలని డిమాండు చేశారు. మతురాలు యొక్క తల్లిదండ్రుల అనుమానాలు నిజమైతే నిందితులకు కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే బుల్లెట్ కంటే వేగంగా మాజగనన్న వస్తారు అని చెప్పిన మ ంత్రి రోజా గారు ఈ సంఘటనపై స్పందించి మతురాలి కుటుంబానికి అండగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హతసాధించిన పెద్దిరెడ్డి హాసితారెడ్డి

పీలేరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:



స్థానిక అక్షర కోచింగ్‌సెంటర్ నిర్వాహకులు పెద్దిరెడ్డి విజయగోపాల్‌రెడ్డి కుమార్తె హాసితారెడ్డి2023 నవోదవ ప్రవేశపరీక్షలో అర్హతసాధించి నవోదయలో ప్రవేశం పొందింది. ఈసందర్భంగా కోచింగ్‌సెంటర్ నిర్వాహకులు విద్యార్తిని అభినందించారు.ఆ విద్యార్థిని భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అక్షర కోచింగ్ సెంటర్ గత10 సంవత్సరాల నుంచి ఉత్తమ శిక్షణ ఇస్తూ ఎంతో మంది విద్యార్తులను నవోదయ, సైనిక్ స్కూళ్ల ప్రవేశానికి అర్హత సాధించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థిహాసిత రెడ్డిని మరియు కోచింగ్‌సెంటర్ నిర్వాహకులు పెద్దిరెడ్డి విజయగోపాల్‌రెడ్డిని అభినందించారు.

## రేగళ్లులో ఘనంగా నా మట్టి నాదేశం కార్యక్రమం

పీలేరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:



స్వాతంత్ర్య సమరయోదులు త్యాగాలను స్మరించుకుందాం అని ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి , కలికిరి ఐటీబీపీ ఇన్స్‌పెక్టర్ వై.వి.రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రేగళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలికిరి ఐటీబీపీ ఆద్వ ర్యంలో నా మట్టి నా దేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. పై కార్యక్రమానికి ఎంపీడీఓ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు ఈప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించబడుతుందన్నారు. మన రాజధాని ఢిల్లీలో నూతనంగా నిర్మించిన పార్లమెంటు ఆవరణంలో గల ఉద్యానవనంలో సేకరించిన మట్టిని వేయడం జరుగుతుందని తెలిపారు. ఆజాదీకా అమత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ముగింపు ఉత్సవాలు జరుపుకుంటామని అన్నారు. రేగళ్ల , బాలంవారిపల్లె సచివాలయ పరిధిలోని వలంటీర్లు గ్రామాల నుంచి పిడికెడు మట్టిని కలశంలో తీసుకువచ్చి ఐటీబీపీ వారికి అందజేశారు. రేగళ్ల పురవీధులలో విద్యార్థులచే నినాదాలు డప్పు వాయిద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పార్వతమ్మ, ఉపాధ్యాఉలు జ్ఞాన ప్రకాష్, మస్తాన్‌ఖాన్, ఆదికేశవులునాయుడు, శ్రీనివాసులు, కార్యదర్శులు, వలంటీర్లు, కలికిరి ఐటీబీపీ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాదరెడ్డి



పీలేరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని మాజీ ఎమ్మెల్యే జీవి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక శ్రీనాథపురం కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, రత్నం స్కూల్ తదితర ప్రాంతాల్లో గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గరించి వవరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుతం పార్టీలకు అతీతంగా అభివద్ధి సంక్షేమ పథకాలు అందిస్తుందని మేనిపెస్టోలో ఇచ్చి హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మరోసారి సీఎంను ఆదరించాలని వారుకోరారు. ఈకార్యక్రమంలోజీవి. రాకేష్ రెడ్డి,జడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచి హబీబ్‌బాషా, మండల కన్వీనర్ దండు జగన్ మోహన్‌రెడ్డి నాయకులు కాలనీ చిన్న, నాగరాజ నాయక్, కలావతి మోహన తదితరులు పాల్గొన్నారు.

## 15 లీటర్లు నాటుసారా స్వాధీనం

కేవి.పల్లె, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:



మండలంలోని బురుజుకాడపల్లె గ్రామం అడవి ప్రాంతంలో బుధవారం దాడులు నిర్వహించగా అదే గ్రామానికి చెందిన రఫీబాషా వద్ద 15లీటర్లు సారా కలిగి ఉండగా అతనిని అరెస్టు చేసి కేసు నమోదుచేసి రిమాండుకు తరలించామని పీలేరు ఎస్ఈబీ సీఐ గురుప్రసాద్ తెలిపారు. ఈదాడులలో ఎస్పై లక్ష్మీనరసయ్య, సిబ్బంది సుధాకర్, బాలకష్ణలు పాల్గొన్నారు.

## జాతీయ సహ సమన్వయకర్తగా భవ్య

పులివెందుల రూరల్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :



బ్రహ్మపథం ఆధ్యాత్మిక సేవా సంస్థ జాతీయ సహ సమన్వయకర్తగా పులివెందులకు చెందిన భవ్య నియమితులయ్యారు. పోతులూరి వీరబ్రహ్మంం కాల జ్ఞాన మహిమలు రాష్ట్ర నలుమూలల తెలియపరచాలని బ్రహ్మపథం స్థాపించిన శ్రీక్రిష్ణమాచార్య స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజరు వంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న పెట్రోలు ట్యాంకరు

వేంపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :



వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆటోను హిందుస్థాన్ పెట్రోలియం ట్యాంకరు బుధవారం ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరు మంది కి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికుమాపల్లె, కదిరేపల్లె గ్రామాలకు చెందిన 10మంది వేంపల్లెలో తమ సొంత పనుల నిమిత్తం తిరిగి ఆ గ్రామాలకు వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగింది. అందులో ప్రయాణిస్తున్న ప్రసన్న, బోగాదమ్మ, బాల గంగన్న, ఆటో డ్రైవరు చిన్న లక్ష్మయ్యతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. పులివెందుల నుండి కడపకు పెట్రోలు ట్యాంకు వెళ్తుండగా వేంపల్లె నుండి తాటిమాకులపల్లె గ్రామానికి ఆటో వెళ్తున్న క్రమంలో హనుమాన్ జంక్షన్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికి గమనించి గాయాలపాలైన వారిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముగ్గరికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు సూచించారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు లిటిల్‌ఫ్లవర్ విద్యార్థుల ఎంపిక

వేంపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వేంపల్లె లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎఫ్ బాషా తెలిపారు. జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్14 విభాగంలో సయ్యద్ సారా, ఆర్.రెడ్డెయ్య విద్యార్థులు తమ ప్రతిభను కనపరిచినట్లు తెలిపారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపాలని పాఠశాలలతో పాటు తమ తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. అంతేకాకుండా ప్రతి విద్యార్థి చదువు పట్ల శ్రద్ధ చూపి క్రీడల్లో రాణించి అత్యుత్తమ స్థానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా తమ సహాయ సహకారాలు ఉంటాయని, క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థుల పట్ల ప్రిన్సిపల్ ముబీనా, డైరెక్టరు అన్వర్ ఉల్ హక్, పీఈటీ జనార్ధన్, పాఠశాల ఇన్‌ఛార్జి ఇక్బాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

# పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన ఏడీ సుబ్బారావు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



మండలంలోని మొయిళ్ల కాల్వ, ఇసుకపల్లె, పెండ్లిమర్రి, మాచనూరు తదితర గ్రామాల్లో బుధవారం ఏడీ సుబ్బారావు పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పంటలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో బ్లెస్సీ, ఏఈవోలు గంగప్రసాద్, గంగాదర్‌రెడ్డి, వీహెచ్ఏ వసంత, లక్ష్మీ, ఎంపీఈవో మాధుర్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నల్ల గంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.2,38,324

సంబేపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



దేవర రాయి నల్ల గంగమ్మ తల్లి హుండీ ద్వారా రూ.2,38,324 ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ జనార్ధన్, ఈవో కొండారెడ్డిలు తెలిపారు. బుధవారం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ జనార్ధన్, ఈవో కొండారెడ్డిల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది సేవకులు హుండీ లెక్కింపు నిర్వహించారు. నాలుగు మాసాలకు గాను హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెంకట శేషయ్య, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ప్రవక్త జ్ఞాపకాలకు గంధోత్సవం

జమ్మలమడుగు, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



ఈనెల 28వ తేదీ గురువారం మిలాదున్నబీ పండగ రోజున మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా బుధవారం సాయంత్రం పట్టణంలోని జామియా మసీదులో మహమ్మద్ ప్రవక్త పవిత్ర జ్ఞాపికలకు పాషా ఖాద్రి భక్తులతో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మహమ్మద్ ప్రవక్త యొక్క పవిత్ర జ్ఞాపికలకు గంధోత్సవం నిర్వహించి ప్రత్యేక ఫాతెహాను ముస్లిం సోదరులు నిర్వహించారు. అనంతరం గురువులు, పకీర్లు, ముస్లిం సోదరులు, చిన్నారులు ప్రతి ఒక్కరూ ప్రవక్త జ్ఞాపికలకు భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురువులు ఇర్షాద్, జానీ ఖాద్రీ, అసద్ పాషా ఖాద్రి, పీఠాధిపతి సోదరులు, కుటుంబీకులు, ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# ఘనంగా సుధా అంకిరెడ్డి అంత్యక్రియలు

కమలాపురం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు సుధా అంకిరెడ్డి మంగళవారం మృతి చెందారు. బుధవారం ఆయన స్వగ్రామమైన సి.రాజుపాలెంలో కుటుంబ సభ్యులు, బంధువులు తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. ఇందులో భాగంగా బుధవారం అంత్యక్రియలను నిర్వహించారు. సుధా అంకిరెడ్డి మృతికి పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘన నివాళులు అర్పించారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి సుధా అంకిరెడ్డి స్వగ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పూలమాలలు వేసి సుధా అంకిరెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే గండ్లూరు వీరశివారెడ్డి, పార్లమెంటు అధ్యక్షులు లింగారెడ్డి, తెదేపా రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సాయినాథ్‌శర్మలు అంకిరెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సి.రాజుపాలెం గ్రామానికి తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

### అంకిరెడ్డి ఆత్మకు దేవుడు శాంతి ప్రసాదించాలి

తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు, కమలాపురం మండలం సి.రాజుపాలెం నాయకుడు సుధా అంకిరెడ్డి ఆత్మకు శాంతిని భగవంతుడు ప్రసాదించాలని తెదేపా రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ కోరారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం హైదరాబాదు సన్‌సైన్ ఆసుపత్రిలో మృతి చెందిన అంకిరెడ్డి మృతదేహానికి సాయినాథ్‌శర్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. బుధవారం రాజుపాలెం గ్రామంలో జరిగిన సుధా అంకిరెడ్డి భూస్థాపిత అంత్యక్రియల్లో సాయినాథ్‌శర్మ పాల్గొన్నారు. ప్రజా నాయకుడిగా అంకిరెడ్డి అనేక మంది పేద ప్రజానీకానికి సేవ చేశారని ఆయన సేవలను కొనియాడారు. అభిమాన నాయకులు రామసుబ్బారెడ్డి, నాగేంద్రరెడ్డి, పెద్దచెప్పలి ఎంపీటీసీ నాగరాజ ఆచారి, మైనార్టీ నాయకులు షుకూర్, ఎస్సీ నాయకులు నామాల నాగరాజు పాల్గొన్నారు.

# భువనేశ్వరిని కలిసిన గంటా నరహరి

రాజంపేట అర్బన్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త

ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఆదరిస్తున్న తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబునాయుడును అరెస్ట్ చేసి శునకానందం పొందుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి త్వరలోనే బుద్ధిచెప్పడం ఖాయమని టిడిపి పార్లమెంట్ ఇన్‌ఛార్జి గంటా నరహరి పేర్కొన్నారు. బుధవారం ఆయన రాజమండ్రిలో నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం ప్రకటించారు. తెలుగు జాతి కోసం అహర్నిశలు శ్రమించిన చంద్రబాబునాయుడు త్వరలోనే బయటకు వస్తారని ఆమెకు చెప్పారు. రానున్న రోజుల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీపరంగా విస్తృత కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

# వాహనాలు తనిఖీ చేసిన ఎస్సై



పెండ్లిమర్రి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

మండలంలోని కడప-పులివెందుల ప్రధాన రహదారిలో బుధవారం ఎస్సై సునీల్‌కుమార్‌రెడ్డి ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలని లేని పక్షంలో జరిమానాలు విధించడంతో పాటు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :



రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గుంతబజారు, మెయిన్‌రోడ్డు, పూలంగళ్ల సర్కిల్, రవి బుక్‌స్టాల్ ప్రాంతాలలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిలకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్, సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ హఫీజ్, ఒతూరు రసూల్, కమీషనరు నరసింహారెడ్డి, కౌన్సిలర్లు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవయవదానం ప్రాణదానంతో సమానం



వేంపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :

అవయవదానం ప్రాణదానంతో సమానమని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ జి.మల్లేశ్వరమ్మ అన్నారు. వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత హై కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు అవయవదానం, రక్తదానంపై అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, స్నేహిత అమృతహస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ సమాజంలో అవయవదానంతో ఎంతోమందికి ప్రాణాలు నిలపవచ్చని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఈ విషయంలో అవగాహన అవసరం అన్నారు. అపోహలు తొలగించేందుకు యువత కృషి చేయాలన్నారు. రక్తదానం చేయడం వల్ల కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో రక్తకణాలు ప్రధానపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ అధికారిణి మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు శ్రీనివాసులు, సంస్థ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

# జగనన్నకు చెబుదాం సమస్యల వెల్లువ




నందలూరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్త

నందలూరు మండలం ఎంపిడిఒ కార్యాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌కాన్, రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు. మండలంలోని ప్రజలు అత్యధిక సంఖ్యలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. తహశిల్దారు కార్యాలయంలో ఎన్ని అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడంలేదని తమ భూములకు డిఫారంలు, పాసుబుక్కులు ఉన్నవారు వాటిని వేరేవారు ఆక్రమించారని చెప్పినప్పటికి దానిపై తహశిల్దారు స్పందించలేదని ఫిర్యాదులు రావడంతో జాయింట్ కలెక్టర్ తహశిల్దారును పిలిచి వారిపై సోమవారం లోపుల పూర్తి చేసి తమకు నివేదిక పంపాలని చెప్పడం జరిగింది. ఇంటి స్థలాలు చాలావరకు మంజూరు చేయలేదని కూడా అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా, డివిజన్, మండల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎంపిడివోను కలిసిన సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి

పోరుమామిళ్ళ రూరల్, సెప్టెంబర్ 27ప్రభాతవార్త:



పోరుమామిళ్ళ మండలం ఎంపిడివో వరప్రసాద్‌ను బుధవారం రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జడ్పీటిసి ముత్యాల ప్రసాద్,ఎంపిటిసి రమణలు కలిసి అభినందనలు తెలిపారు.

# రక్తహీనత సమస్యలను అధిగమించాలి

పీలేరు, సెప్టెంబరు 27 ప్రభాతవార్తః



గర్భవతులు, బాలింతలు చిన్నపిల్లలు, తల్లుల్లోని రక్తహీనత సమస్యలను అధికమించాలని పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రాజమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజ నిర్మాణం కోసం తల్లి, పిల్లలు, గర్భవతులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సీడీపీఓ అంగన్‌వాడీ కార్యకర్తల దగ్గర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేయించారు. ఈకార్యక్రమంలో పీలేరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, సీహెచ్ఓ నిషిత, మహిళా పోలీసులు షర్మిల, కవిత, ఆశవర్కర్లు కష్ణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం రాష్ట్ర కన్వీనర్ చిన్నమ్మ, కార్యకర్తలు శాంత, రోజ, కళావతి, లక్ష్మీపార్వతి, గౌసున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల హక్కులను కాపాడండి

గాలివీడు, సెప్టెంబర్ 27(ప్రభాతవార్త):



భారత రాజ్యాంగం గ్రామ పంచాయతీ సర్పంచులకు కల్పించిన హక్కులను కాపాడాలని పూలికుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం మండల పరిషత్ సభా భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సర్పంచుల హక్కులను కాపాడాలంటూ ప్రభుత్వ వ్యతిరేక చర్యలపై మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని పంచాయతీరాజ్ చట్టం 73, 74 అధికారణాలు, సర్పంచులకు పూర్తి హక్కులను విధులను కల్పించిందని తెలిపారు. కానీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన సర్పంచుల హక్కులను కాలరాస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు చందకొండ వాడుకుంటున్నదని ఇలాంటి దుస్థితి భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. సర్పంచుల నిధులను ప్రభుత్వం వాడుకోవడం వల్ల గ్రామాల్లఓ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీల సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని ఇలాంటి దుస్థితి ఎన్నడూ లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల హక్కులను కాపాడుకోవడానికి పార్టీలకతీతంగా సర్పంచులందరూ ఏకమై పోరాడాలని కోరారు.

# ప్రీస్కూల్ పిల్లల శాతాన్ని పెంచండి

ఎసిడిపిఒ సరళా

పుల్లంపేట, సెప్టెంబరు 27 ప్రభాతవార్త

మండలంలో అంగన్వాడి సెంటర్లలో పౌష్టికాహారంతో పాటు బాలింతలు, గర్భవతులకు సక్రమంగా ప్రభుత్వం అందించే అన్నిరకాలైనటువంటి పౌష్టికాహారం సకాలంలో అందజేయాలని పుల్లంపేట ఎంపిడిఒ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు పౌష్టికాహారాన్ని అందించి పిల్లల్లో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు పడాలని పేర్కొన్నారు. ఎసిడిపిఒ సరళాదేవి మాట్లాడుతూ పౌష్టికాహారం గురించి, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ గురించి వివరించారు. అలాగే ప్రీస్కూల్ శాతాన్ని పెంచాలని ఆదేశించారు. అనంతరం గర్భితులకు సీమంతాలు, ఆరు నెలలు పూర్తయినవారికి అన్నప్రాసన, ప్రీ స్కూల్ పిల్లలకు పిపి-1, పిపి-2, సిలబస్‌బుక్స్, అంగన్వాడి కార్యకర్తలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. చివరగా సిడిపిఒ సౌభాగ్యమ్మ మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట మండలంలో 3 సబ్‌సెంటర్‌లు తనకు ముగ్గురు బిడ్డల్లాంటివారని, వాటిని సంపూర్ణస్థాయిలో ఎదిగేవిధంగా ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. ఈ మేరకు ప్రతిఒక్క కార్యకర్త ఇంకా ముందుకెళ్లి ఇప్పటికంటే ఇంకా ఎక్కువ శాతంలో మంచిపేరు తెచ్చుకోవాలని కొనియాడారు. యూనియన్ నాయకురాలు శ్రీలక్ష్మీ చొరవ తీసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతృప్తిగా ఉందని అంటూ ఆమెను కొనియాడారు. మండలంలో ప్రతిఒక్క కార్యకర్తను పేరు పేరునా కొనియాడుతూ ఇదేవిధంగా భవిష్యత్తులో పుల్లంపేట మండలంలో ఏ కార్యక్రమం జరిగినా విజయవంతం చేసుకోవాలని ఆమె సూచించారు.

# జిపిఎస్ బిల్లు పేపర్లు దగ్ధం చేసిన యుటిఎఫ్



రాజంపేట అర్బన్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త

ఉపాధ్యాయ ఉద్యోగుల ఆశలు వమ్ము చేస్తూ జిపిఎస్ బిల్లుకు బుధవారం శాసనసభలో ఆమోదం తెలిపినందుకు నిరసనగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు బిల్లు పేపర్లను దగ్ధం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జిపిఎస్ ప్రతుల పేపర్లను దగ్ధం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిపిఎస్ విధానానికి, జిపిఎస్ విధానానికి తేడా ఏమిలేదని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. జిపిఎస్‌లో కూడా ఉద్యోగుల వాటా చెల్లించాలని అంతేగాకుండా పదవి విరమణ తర్వాత ఆ వాటా కూడా చెల్లించకుండా షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు, రాజంపేట మండల నేతలు వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, శివయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 85 స్కాముల జగన్‌కు జీవితం జైల్లోనే



రాజంపేట అర్బన్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త

గత నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో 85 స్కాంలు జరిగాయని, ఒక్కొక్క స్కాం బయటకు తీసినా జగన్ జీవితకాలం జైల్లో ఉండాల్సి వస్తుందని రాజంపేట తెలుగుదేశంపార్టీ అసెంబ్లి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు పేర్కొన్నారు. బుధవారం దీక్షల్లో ఆయన మాట్లాడుతూ జీవితకాలం జైల్లో ఉండేందుకు సిద్ధంగా ఉండాలని ఎద్దేవా చేశారు. నాణ్యతలేని మద్యంతో అమాయకుల ప్రాణాలను తీస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబును జైలుకు పంపి పవన్‌కళ్యాణ్ సినిమాల్లో బిజీగా ఉండడంతో ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని వైకాపా విస్తృత ప్లాన్ చేస్తుందన్నారు. జైలు పక్షి జగన్‌కు మరలా జైలు తప్పదని విమర్శించారు. తండ్రి వైఎస్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్ష కోట్లు దోచుకున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. జనసేన పార్లమెంట్ కన్వీనర్ ముఖరంచంద్ మాట్లాడుత ఎంఐఎం అధినేత ఒవైసి చంద్రబాబు పట్ల వెటకారంగా మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. మైనార్టీలను అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకుంటున్న ఒవైసిని మైనార్టీలే ఆంధ్రాలో తరిమికొడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

# భవ్యశ్రీ హత్య పట్ల సీబీఐ విచారణ చేపట్టాలి

– ప్రజా సంఘాల డిమాండ్



బద్వేలు అర్బన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా పెనగలూరు మండలం వేణుగోపాలపురం గ్రామంలో ఇంటర్ చదువుతున్న భవ్యశ్రీని అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరమణ పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు పెంచలయ్య డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న గోపాలపురంలో నలుగురు యువకులు ట్రాప్ చేసి ఆ అమ్మాయిని అత్యాచారం చేసి హత్య చేసిన యువకులను కఠినంగా శిక్షించి సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం, కేంద్రంలో దళితులు అనగారిన వర్గాల పైనే దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ చోద్యం చూస్తుండడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు మునిరత్నం, ఏసన్న, శ్రీను, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కొండాపురం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :

కొండాపురంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ క్రిష్ణవేణమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన ఐదు మంది విద్యార్థినులు రాష్ట్ర టీమ్‌లో ఆడేందుకు ఎంపికయ్యారన్నారు. పీఈటీ మాధవి, కాటమ్మలను ప్రిన్సిపల్ అభినందించారు.

# అంగరంగ వైభవంగా శ్రీరంగడి కల్యాణం



పులివెందుల, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :

పులివెందులలోని వెలసిన శ్రీరంగనాథస్వామి నూలు పూజోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణ ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత వారం రోజులుగా ఆలయంలో నూలు పూజోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులైన చల్లా వంశీయుల ఆధ్వర్యంలో ఈ కల్యాణ వేడుక జరిగింది. అర్చకులు సాయిభరద్వాజశర్మ ఆధ్వర్యంలో ఈవో వెంకట రమణ పర్యవేక్షణలో ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి కార్యవర్గం కలిసి విజయవంతం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లె క్రిష్ణ రాజేష్‌శర్మ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ వైకాపా ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఛైర్మన్లు సుధాకర్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్, వైకాపా నాయకులు వరప్రసాద్, గంగాధర్‌రెడ్డి, ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య హైస్కూల్‌లో కలర్స్‌డే వేడుకలు




వేంపల్లె, సెప్టెంబరు 27, ప్రభాతవార్త :

వేంపల్లెలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో బుధవారం కలర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆకుపచ్చ, ఎరుపు, పసుపురంగుల దుస్తులు ధరించి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. అలాగే చిన్నారులు నృత్యాలు చేసి అందరినీ అలరించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. చిన్నారులకు చదువుతోపాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టండి

ఎంపీపీ జల్లా పద్మావతమ్మ



గాలివీడు, సెప్టెంబర్ 27(ప్రభాతవార్త):

ప్రజా సమస్యలపైన అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ పిలుపునిచ్చారు. బుధవారం ఎంపీడీఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం మండల వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను, అధికారులు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేపటి భావితరాలకు, ప్రభుత్వ కార్యకలాపాల అవసరాలకు ప్రభుత్వ భూమిని మిగల్చకుండా కబ్జాదారులు కబ్జా చేస్తున్నారన్నారు. మరో పక్క పంచాయతీ అనుమతులు లేకుండా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేస్తున్నారని, పంచాయతీ నియమ నిబంధనలు అనుసరించకుండా విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు వెంచర్లు వెయ్యడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంచర్ల ఏర్పాట్లలో పంచాయతీ అనుమతులు తీసుకుంటే కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో దళారీతనంతో పాటు సర్వేయర్ వ్యవస్థ చాలా దారుణంగా ఉందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తప్ప వేరే ఉపయోగం లేదన్నారు. గ్రామసచివాలయ వ్యవస్థలో ప్రజల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారమార్గం చూపడమే సచివాలయ వ్యవస్థ ధ్యేయమన్నారు. అందుకు భిన్నంగా సచివాలయంలో పనిచేసే సర్వేయర్లు, వీఆర్‌ఓలు అందుబాటులో ఉండటం లేదని ప్రజా సమస్యలు వారు గాలికొదిలేశారన్నారు. ప్రజాప్రతినిధులుగా మేము జగనన్న కాలనీ సమస్యలపై అనేక మార్లు హద్దుల కోసం మండల సర్వేయర్‌ను కోరితే ఆయన ప్రజాప్రతినిధులకు చుక్కలు చూపెడుతున్నారని సభా దృష్టికి తెచ్చారు. అధికారుల తీరు మారకుంటే ప్రజాప్రతినిధులంతా వారిపైనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తదుపరి చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆయా శాఖ అధికారులు వారి శాఖలకు సంబంధించిన నివేదికలను వివరిస్తూ సభలో ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# పోలీసు స్టేషన్ల ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు పోలీసు స్టేషన్లను బుధవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులకు స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టేషన్లలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలతో వచ్చే బాధితులకు మర్యాదపూర్వకంగా పలకరించి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బంది పూల బొకేతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేరణకుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్త



ప్రభాతవార్త న్యూస్ నెట్‌వర్క్

విలేకర్లు కావలెను

తెలుగు దినపత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దినపత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను

కావలసిన సెంటర్లు

అన్నమయ్య జిల్లా : బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, మొలకలచెరువు, కురబలకోట.
వైఎస్ఆర్ జిల్లా : ముద్దనూరు, యర్రగుంట్ల, మైలవరం, పెద్దముడియం, బద్వేల్ రూరల్, జమ్మలమడుగు రూరల్, వల్లూరు, చెన్నూరు, కాశినాయన

ఇంటర్వ్యూ తేది : 02-10-2023

మీ పూర్తి బయోడేటాతో క్రింది చిరునామాలో సంప్రదించలరు

వార్త కార్యాలయం, హౌసింగ్ హోర్డు కాలనీ, కడప.
సెల్ : 9848787289, 9491490468.